క్లుప్తంగా

విద్యార్థినికి అభినందనలు


విద్యార్థినిని సన్మానిస్తున్న అనిల్‌కుమార్

తర్లుపాడు: మండలంలోని మీర్జపేట జెడ్పీ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థిని పి మమతను సేవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ డైరెక్టర్ అనిల్‌కుమార్, కే విమలమ్మ, హెచ్‌ఎం ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొహర్రం సందర్భంగా పీర్ల పెట్టెల ఊరేగింపు


పీర్లపెట్టెల ఊరేగింపులో పాల్గొన్న ముజావర్లు

మార్కాపురం టౌన్: మొహర్రం పండుగను పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని వివిధ పీర్ల చావిడిలలో ఉన్న పీర్ల పెట్టెలను శనివారం ఊరేగింపు నిర్వహించారు. నెలవంక కనిపించడంతో పట్టణంలోని పీర్ల చావిడిల్లో పీర్లకు ఊరేగింపు నిర్వహించారు. మత సామరస్యానికి చిహ్నంగా నిలిచే మొహర్రం పండుగ ప్రారంభమైంది. గొర్లగడ్డ పీర్లచావిడిలో ముజావర్లు జెండాను ఎగురవేశారు. డప్పులు, తప్పెట్ల నడుమ పీర్లపెట్టెలను పట్టణంలో ఊరేగించారు. భక్తులు పీర్ల పెట్టెలను దర్శించుకుని పప్పులు, బొరుగులను ఫాతేహాలుగా సమర్పించుకున్నారు.

పిల్లలను బడిబాట పట్టించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గిరిధర్‌శర్మ

రాచర్ల: మండలంలోని 6 నుంచి 14 సంవత్సరాల మధ్య వయసుండి బడిబయట ఉన్న పిల్లలను, మధ్యలోనే బడి మానేసిన చిన్నారులను గుర్తించి ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని ఎంఈవో వారణాసి గిరిధర్‌శర్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎంలకు, ప్రిన్సిపాల్‌లకు, మహిళ పోలీసులకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, విద్యార్థుల జాబితా, తల్లికి వందనం గురించి సమావేశం చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి, ఎంఈవో-1 కోటేశ్వరరావు, హెచ్‌ఎం నాయక్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు కార్డులు ఇవ్వాలి

మార్కాపురం: పట్టణ, మండల పరిధిలోని కౌలు రైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని రెవెన్యూ సిబ్బందికి తహశీల్దార్ చిరంజీవి సూచించారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏ, విలేజ్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తమ పరిధిలో ఉన్న 1700 మంది కౌలు రైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని ఆదేశించారని తెలిపారు. ఆయా రైతుల జాబితాను రెవిన్యూ సిబ్బందికి ఇచ్చారని, 5 రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏఓ బుజ్జిబాయి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కూడా బిల్లులు చెల్లించవచ్చు

పొదిలి రూరల్: వినియోగదారుల సౌకర్యార్థం నేడు పొదిలి, దర్శి డివిజన్ పరిధిలోని కరెంటు బిల్లుల కేంద్రాలు తెరిచేఉంటాయని వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈఈ పీ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సకాలంలో బిల్లులు చెల్లించి విద్యుత్‌శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

వరుణుడు కరుణించక.. ధరలు తగ్గక!

- కొండెక్కిన కూరగాయల ధరలు
- వర్షాలు లేక మొదలుకాని కూరగాయల సాగు
- బెంగళూరు నుంచి సరఫరా



మార్కాపురం: వేసవిని మించిపోతోంది ప్రస్తుతం జూన్ మాసం. నెలాఖరువుతున్నా కూడా రుతుపవనాలు ముఖం చాటేయడంతో వర్షాలు కురవడం లేదు. దీంతో కూరగాయల ధరలు కొండెక్కాయి. రూ.100 నోటు తీసుకెళితే రెండు రోజుకు సరిపడా కూరగాయలు రావడం లేదు. వర్షాకాలం ప్రారంభమైనా వర్షాలు లేకపోవడంతో కూరగాయల సాగు ప్రారంభం కాలేదు. దీనితో ప్రధానమైన కూరగాయలైన మిర్చి, క్యారెట్, బీట్‌రూట్, బీన్స్, క్యాబేజీ, క్యాప్సికం తదితర కూరగయాలన్ని మార్కాపురం మార్కెట్‌కు బెంగళూరు నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీనితో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 10 రోజుల వ్యవధిలో కూరగాయల ధరలు అనూహ్యంగా పెరిగిపోయాయి. అసలే జూన్ నెల కావడంతో ప్రతి కుటుంబంలో విద్యార్థుల ఫీజులు, పుస్తకాలు తల్లిదండ్రులకు అదనపు ఖర్చు కాగా కూరగాయల ధరలు కూడా పెరగడంతో కష్టంగా మారింది. మార్కాపురం కూరగాయల మార్కెట్ నుంచి ప్రతిరోజూ త్రిపురాంతకం, యర్రగొండపాలెం, దోర్నాల, శ్రీశైలం, పెద్దారవీడుకు తరలివెళ్తుంటాయి.

రైతు బజారు లేకపోవడంతో..

కూరగాయల మార్కెట్‌లో ధరలు విపరీతంగా పెరగడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కాపురంలో రైతు బజారు లేకపోవడంతో వ్యాపారులు చెప్పిన ధరకే వినియోగదారులు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కాపురంలో రైతు బజారు ఏర్పాటు చేస్తే రైతులు నేరుగా మార్కెట్‌కు తీసుకునివచ్చి తక్కువ లాభంతో వినియోగదారులకు కూరగాయలు అమ్మవచ్చు. ప్రస్తుతం వ్యాపారులు చెప్పిందే ఇష్టారాజ్యంగా మారింది. ఈ ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఆగస్టు నెలాఖరు నాటికి స్థానికంగా పండే కూరగాయలు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకూ ధరలపై నియంత్రణ లేకపోవడంతో పెరుగుతాయి.

కూరగాయలు	ప్రస్తుతం ధర (రూ.కిలో)	10 రోజుల క్రితం ధర
బీన్స్	120	100
చిక్కుడు	80	60
క్యాప్సికం	80	60
క్యారట్	70	55
కాకర	60	45
బీట్‌రూట్	60	50
బీర	60	45
దొండ	50	40
మిర్చి	50	40
బెండ	50	40
టమోట	30	20

బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయం


బంగారు బాల్యంపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: బాలల హక్కులను పరిరక్షించటానికి, వారి సంక్షేమాన్ని పెంపొందించటానికి 'బంగారు బాల్యం' కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందని ఎంఈవో-2 నరసింహారావు, బంగారు బాల్యం స్కూల్ కో ఆర్డినేటర్ గీత పేర్కొన్నారు. శనివారం మండలంలోని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఆదినారాయణ ఆధ్యక్షతన 'బంగారు బాల్యం'పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కలిపించారు. అనాథ బాలలు, బాల కార్మికులు, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలు, బాల నేరస్తులు బంగారు బాల్యం పరిధిలోకి వస్తారని అన్నారు. పాఠశాలల వారిగా 115 మందివి సేకరించామని, ఇంకా వివరాలు సేకరించాల్సి ఉందని ఎంఈవో అన్నారు. అనంతరం గ్రామంలో బంగారు బాల్యంపై అవగాహన కల్పిస్తూ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

జూలై 9న దేశవ్యాప్త సమ్మె

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకురాలు ఎస్కే సమీర పేర్కొన్నారు. పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీన నిర్వహించబోయే సమ్మె నోటీసును శనివారం స్థానిక ఎంఆర్‌సి భవనంలోని ఎంఈవో కె.వెంకటేశ్వరరావును కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. శానిటేషన్ వర్కర్స్‌పై రాజకీయ తొలగింపు ఆపాలన్నారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్, పెన్షన్ సౌకర్యం, నాలుగు లేబర్ కోడ్స్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మల్లీశ్వరి, పీరాంబి, వై.రాధ తదితరులు పాల్గొన్నారు.


ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

పాస్టర్‌పై చర్యలు తీసుకోవాలి

మార్కాపురం టౌన్: ఒక పాస్టర్ హిందూ మహిళలను అవమానకరంగా మాట్లాడాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం సాయంత్రం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి, ఎన్ లావణ్య, మల్లీశ్వరీ తదితరులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఒక పాస్టర్ హిందూ మహిళలు మల్లెపూలు పెట్టుకున్న వారిని అవమానకరంగా మాట్లాడారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. హిందూ మహిళల మనోభావాలు దెబ్బతీసేలా అతని వ్యాఖ్యలు ఉన్నాయని, భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సై సైదుబాబును కోరారు.


ఎస్సై సైదుబాబుకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

జగనన్నను మరోమారు సీఎం చేసుకుందాం



మాజీ ఎమ్మెల్యే రాంబాబు, మురారిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

- కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అన్నా

తర్లుపాడు: కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పనిచేసి మరోమారు సీఎంగా జగనన్నను చేసుకునేందుకు సహకరించాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు కోరారు. శనివారం మార్కాపురం జవహర్ నగర్‌కాలనీలోని పార్టీ కార్యాలయంలో తర్లుపాడు మండల నాయకులు కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన మురారి వెంకటేశ్వర్లుని అభినందించారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరినీ కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ఈనెల 11న పొదిలిలో జరిగిన రైతు పోరుబాటలో మండలం నుంచి పెద్దఎత్తున జగనన్న కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం అన్నాను మండల పార్టీ అధ్యక్షులు మురారిని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామసుబ్బారెడ్డితో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

పంచాయతీ కార్యదర్శుల మాస్ లీవ్


ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న కార్యదర్శులు

కొనకనమిట్ల: మండలంలోని 26 గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు అందరూ మాస్ లీవ్ పెడుతున్నట్లు శనివారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఈశ్వరమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ విధులలో పని ఒత్తిడి ఎక్కువగా ఉండటం వలన ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు మాస్ లీవ్ పెట్టి తమ నిరసనను సంబంధిత కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళుతున్నట్లు, ఈ మేరకు మేము కూడా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం అందజేయనున్నట్లు కార్యదర్శులు తమ ఆవేదనను వెల్లడించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ నియామకం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

బేస్తవారిపేట: స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆ సంఘం సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జీ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా సీహెచ్ కోటారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వీరనారాయణ, ప్రసాదరావు, జనరల్ సెక్రటరీగా కేసీహెచ్ వెంకట్రామయ్య, ట్రెజరర్‌గా నందిరెడ్డి, సభ్యులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన కమిటీని శాలువ, పూలమాలలతో సన్మానించారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు


మార్కాపురం: రికార్డులను తనిఖీ చేస్తున్న ఏవో బుజ్జీబాయి


పొదిలి: విత్తనాలు పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసరెడ్డి

మార్కాపురం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో బుజ్జీబాయి హెచ్చరించారు. శనివారం ఆమె పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న స్టాక్స్‌ను, రికార్డులను పరిశీలించారు. రైతులకు అమ్మే విత్తనాలను శాంపిల్స్ తీసుకొని టెస్టింగ్ ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మవద్దని, రైతులు కూడా విత్తనాలు కొనేప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొన్న తరువాత రసీదు పొందాలని, లైసెన్సు ఉన్న షాపులోనే కొనుగోలు చేయాలని సూచించారు.

విత్తనాలు అధిక ధరకు అమ్మితే చర్యలు

పొదిలి: పట్టణంలోని పలు విత్తన, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. దుకాణాలలోని స్టాకును, రికార్డులలోని ఎంట్రీలను సరిపోల్చి పరిశీలించారు. అందుబాటులో ఉన్న విత్తన నాణ్యత పరీక్షల కోసం 05 శాంపుల్స్ ల్యాబ్‌కు పంపించినట్లు శ్రీనివాసరెడ్డి చెప్పారు. విత్తనాలు, ఎరువుల్లో కల్తీలు ఉన్నా, అధిక ధరలకు అమ్మినా, రైతులకు రశీదులు ఇవ్వక పోయినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కొనుగోలు, అమ్మకాలకు సంబంధించి వ్యాపారులు అన్ని రకాల ఫారాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అన్ని రకాల అనుమతి పత్రాలు ఉన్న వాటినే అమ్మకాలు చేయాలన్నారు. ఏవైనా తేడాలు జరిగితే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని తెలిపారు. ఎరువుల రకాలు, ధరలు, నిల్వలు ఎప్పటికప్పుడు బోర్డుపై ప్రదర్శించాలని చెప్పారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

కంభం: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను శనివారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు చూపించని, భౌతిక నిల్వలకు ఈపాస్ మిషన్లకు వ్యత్యాసాలు ఉన్న దుకాణాల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేసి 6-ఏ కేసు నమోదు చేసినట్లు వ్యవసాయాధికారి మహమ్మద్ తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ రాఘవరావు, విజిలెన్స్ ఏవో శివనాగ ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్, సురేష్ బాబు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ రవీంద్రరెడ్డి

రాచర్ల: టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కస్తూరి బా బాలికల పాఠశాలలో చదివే విద్యార్థులకు టీబీ సూపర్‌వైజర్ బీ.రవీంద్రరెడ్డి శనివారం అవగాహన కలిప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైన రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఛాతినొప్పి, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, తదితర లక్షణాలతో బాధపడుతుంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎక్స్‌రే, కళ్లె పరీక్ష ద్వారా టీబీ వ్యాధి నిర్ధారణ అవుతుందని వివరించారు. టీబీ బాధితులకు ఆరు నుంచి తొమ్మిది నెలలపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌ఈవో రంగనాయకులు, ప్రసాద్, కస్తూరి బా బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ మాలకొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

30న డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీసాయి చైతన్య డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 30వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు శనివారం కళాశాల ప్రిన్సిపాల్ జి.రంగస్వామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ డెవలపమెంట్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలో 11 ఎంఎన్‌సి కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. నిరుద్యోగ యువతఅ వకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్వప్న వారాహిగా అమ్మవారి దర్శనం

మార్కాపురం: పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో వారాహి నవరాత్రుల సందర్భంగా మూడో రోజు శనివారం జగదాంబ అమ్మవారిని స్వప్న వారాహి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజ, అష్టోత్తర పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి పూజలు

అర్ధవీడు: మండలంలోని మాగుటూరు గ్రామంలో వెలసిన పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు పద్మావతి వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయంలో వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు.